ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
గురువారం 23 మే 2024

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర: 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.169 | 245 | 279 |
| సూర్యాపేట | రూ.170 | 250 | 280 |
| నల్లగొండ | రూ.166 | 252 | 286 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 । కనిష్ఠం 25.2



సాంకేతిక సమస్య ఉపాధి కూలీలకు తలనొప్పిగా మారింది. సాఫ్ట్‌వేర్ మార్పిడి సందర్భంలో తొలగించిన జాబ్‌కార్డుల్లోని కూలీలకు ప్రస్తుతం బ్యాంకు అకౌంట్ కష్టాలొచ్చిపడ్డాయి. పథకం సాఫ్ట్‌వేర్ మార్పిడి సందర్భంలో కొన్ని జాబ్‌కార్డుల అనుసంధాన ప్రక్రియలో సాంకేతికపరమైన సమస్య ఉత్పన్నమైంది. ఎల్లో, ఆరెంజ్, రెడ్ మార్క్‌తో ఉన్న జాబ్‌కార్డుల్లోని కూలీలకు చెందిన బ్యాంక్ అకౌంట్, ఆధార్ సీడింగ్ అప్‌డేషన్ టెక్నికల్ సిబ్బంది సరిచేయాల్సి ఉంది. అయితే రోజు వారి లక్ష్యాన్ని తగ్గించుకునేందుకు రెడ్ సింబల్ జాబ్‌కార్డులను తీసేసి, మిగతా వాటిని 'రాగాస్' సాఫ్ట్‌వేర్ నుంచి జాబ్‌కార్డులను నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌లోకి అనుసంధానం చేశారు.

- మిర్యాలగూడ అర్బన్

# ఉపాధి పైసల్ పడట్లే!

- కూలీలకు బ్యాంక్ ఖాతా కష్టాలు
- కొందరికి నెలల తరబడి జమకాని వేతనాలు
- ఎన్ఐసీలో కనిపించని పాత జాబ్‌కార్డులు
- ఎన్ఐసీ అనుసంధానంతో తలెత్తిన కొత్తసమస్య

రాగాస్ నుంచి 2022లో తొలగించిన జాబ్‌కార్డులు ప్రస్తుతం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కనిపించకపోవడంతో పలు కుటుంబాలు ఉపాధిహామీ పథకానికి దూరమయ్యే అవకాశం ఉండడంతో కొత్తజాబ్‌కార్డును అందిస్తున్నారు. గతంలో ఏర్పడ్డ టెక్నికల్ సమస్యను పరిష్కరించకుండానే సాఫ్ట్‌వేర్ మార్పు చేయడంతో తొలగిపోయిన జాబ్‌కార్డులోని కూలీలకు సంబంధించిన ఆధార్, బ్యాంక్ ఖాతాలను తిరిగి ఎన్ఐసీలో నమోదు చేయడం సాధ్యపడటం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని వందలాదిమంది కూలీలకు వేతనాలు అందకఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన సాఫ్ట్‌వేర్ టెక్నికల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం కూలీలు నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 12,640 జాబ్‌కార్డులు

రాగాస్ నుంచి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ మార్పిడితో ఉమ్మడి జిల్లాలో 12,640 జాబ్‌కార్డుల్లోని సుమారు 26,380 మంది కూలీలకు బ్యాంక్ ఖాతా, ఆధార్ లింకు సమస్య ఉత్పన్నమైంది. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఇతర పథకాల లబ్ధికోసం ఆధార్ అప్‌గ్రిడేషన్ చేయించి వేలిముద్రలు, వయసు, ఐరీష్, పుట్టినతేదీల్లో చేర్పులు, మార్పులు చేయించుకున్నారు. వీరిలో కొందరు జాబ్‌కార్డులకు సాంకేతిక సమస్య ఏర్పడి తొలగింపు జాబితాలోకి వెళ్లాయి. అలాంటి కుటుంబాలకు ఈ ఏడాది తిరిగి కొత్తగా జాబ్‌కార్డులు జారీచేశారు. ఎన్ఐసీ ద్వారా జారీచేసిన జాబ్ కార్డు నెంబర్‌కు అప్‌డేట్ చేసిన ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంకు ఖాతా నెంబర్ అథెంటిక్ వేరిఫికేషన్ చేసినప్పటికీ స్వీకరించడం లేదు. దీంతో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గతంలో ఉన్న జాబ్‌కార్డులోని కూలీలకు అనుసంధానమై ఉన్నబ్యాంకు ఖాతా నెంబర్ తిరిగి ఎన్ఐసీలో అనుసంధానం చేస్తే తీసుకోవడం లేదు. దీంతో చాలామంది కూలీలు తమ రావాల్సిన ఉపాధి వేతనాలు పొందేందుకు పోస్టాఫీస్, బ్యాంకు చుట్టూ తిరుగుతూ విసుగెత్తిపోతున్నారు. ఈ తరహా సమస్యతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు నుంచి 10 వారాల వేతనాలు జమకావాల్సి ఉంది. ఇదిలా ఉంటే కొన్ని చోట్ల కూలీలు బ్యాంకుఖాతా చిక్కులను ఎదుర్కొంటున్నారు. ఐపీపీబీ (ఇండియన్ పోస్టల్ పేమెంట్‌బ్యాంకు) ఖాతా మినహా ఇతర బ్యాంకు ఖాతాలకు పాన్‌కార్డు, ఆధార్ లింకు చేయించకుండా ఉంటే ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా నేరుగా ఆయా బ్యాంకు ఖాతాలో వేతనాలు జమకావడం లేదు. దీంతో కూలీలు తమ కష్టఫలితం కోసం రోజులుగా నిరీక్షిస్తున్నారు.

**అప్‌డేట్ చేసినా అంతే..**

ఉమ్మడి జిల్లాలోని కూలీలకు వేతనాల చెల్లింపు ప్రక్రియను రెండు విడతలుగా చేపడుతున్నారు. మొదటిబ్యాచ్ కింద గుర్తించిన గ్రామాల్లో పనిచేసిన కూలీలకు ప్రతీ బుధవారం లోపు, రెండో బ్యాచ్ గ్రామాల్లోని కూలీలకు ప్రతీ శనివారం లోపు పనులకు హాజరైన రోజులను పరిగనలోకి తీసుకొని వేతనాలు జమచేస్తున్నారు. ఈ ప్రక్రియ కొనసాగించే సందర్భంలో బ్యాంకు ఖాతా, ఆధార్‌లింకు సమస్యలున్న కూలీలను కంప్యూటర్ ఆపరేటర్లు గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. సదరు కూలీలకు చెందిన బ్యాంకు ఖాతా, ఆధార్‌ను అప్‌డేట్ చేయిస్తున్నప్పటికీ తిరిగి వచ్చే వారంలో అదే సమస్య ఉత్పన్నమై చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఈ తరహా సమస్యను పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సాఫ్ట్‌వేర్ టెక్నీషియన్ల ద్వారా అప్‌డేషన్ చేస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కారం లభించక సిబ్బంది సైతం తల పట్టుకుంటున్నారు.

### గిట్టుబాటు కాని కూలి

రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉపాధిహామీ పథకం పనులకు హాజరయ్యే కూలీలకు వేసవిభత్యం చెల్లించింది. ఈ అలవెన్స్ 2021 వరకు కూలీలకు వర్తింపజేయడంతో చేసిన పనిరేటులో ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం వేసవిభత్యం కింద అలవెన్సు ఉండేది. రాగస్ నుంచి ఎన్ఐసీకి పథకాన్ని మార్చడంతో వేసవి అలవెన్స్ మరుగునపడింది. దీంతో చేసిన పనిని లెక్కించి కూలి రేటు చెల్లిస్తుండగా, కూలీలకు దినసరి వేతనం రూ.150కి మించి దక్కడం లేదు. మండుటెండల్లో చెతులకు బొబ్బలొచ్చేలా కష్టపడ్డా రూ.200 కూలి దక్కని పరిస్థితి. దీంతో పనులకు పురుషులు దూరమై ఇతర పనులకు వెళ్తున్న నేపథ్యంలో మహిళల మాత్రమే పనిప్రదేశాల్లో అత్యధికంగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉపాధి కూలీ రేటును రూ.300లకు పెంచినప్పటికీ పూర్తిస్థాయి వేతన చెల్లింపు జిల్లాలో ఎక్కడా జరగకపోవడం గమనార్హం. వేసవి భత్యం అమల్లో ఉంటే అలవెన్స్‌తో కలిపి దినసరి వేతనం రేటు గిట్టుబాటయ్యేదని కూలీలు వాపోతున్నారు.

### పథకానికి పెరిగిన ఆదరణ

కరువు పరిస్థితులతో ఉక్కిరిబిక్కిరవుతున్న దినసరి కూలీలు, చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఉపాధిహామీ పథకాన్ని ఆదరిస్తున్నారు. దీంతో గత ఏడాదితో పోల్చుకుంటే ఈ దఫా రెట్టింపు స్థాయిలో కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,78,659 జాబ్‌కార్డులుండగా, 19,77,973మంది కూలీలు ఉన్నారు. అందులో 10,06078 పురుషులు, 9,71,895 మహిళాకూలీలు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 4,05,263 జాబ్‌కార్డులుండగా 9,24,947మంది కూలీలుంటే 4,12,082 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 2,97375 జాబ్‌కార్డులున్న కుటుంబాల నుంచి 6,82,153 మంది కూలీలు ఉండగా, 3,54,718 మంది కూలీలు పథకాన్ని ఆదరిస్తున్నారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,76,021 జాబ్‌కార్డుల్లో 3,70,873మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 1,76,930 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఉమ్మడిజిల్లా నుంచి మహిళాకూలీలే అత్యధికంగా పనులకు హాజరవుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ దఫా కూలీల హాజరుశాతం మెరుగుపడినట్లు అధికారులు చెబుతున్నారు. వేసవితీవ్రత తగ్గుతున్న నేపథ్యంలో జూన్, జూలై మాసాల్లో కూలీల హాజరుశాతం రెట్టింపయ్యే అవకాశం ఉంటుందన్నారు.



**ఏడు వారాల కూలి డబ్బులు రాలేదు**

ఏడు వారాల నుంచి ఉపాధి పనులకు హాజరవుతున్నా, ఇప్పటివరకు ఒక్కపైసా కూడా బ్యాంకు ఖాతాల్లో జమకాలే. గతేడాది నుంచి పనికివెళ్లి డబ్బులు తీసుకున్నప్పటికీ ఈ ఏడాది నా జాబ్‌కార్డు పోయింది. కొత్తజాబ్ కార్డు ఇవ్వడంతో మా ఊరిలోని ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, పోస్టాఫీస్ నుంచి ఖాతా తెరిచి అకౌంట్ నంబర్లు ఇచ్చా. కొత్తజాబ్‌కార్డుకు ఖాతా నెంబర్లు జత చేస్తే ఏదీ తీసుకోవడం లేదని ఈజీఎస్ సిబ్బంది చెబుతున్నారు. నాలాగే చాలామంది ఇదేసమస్యను ఎదుర్కొంటున్నారు. అధికారులు పరిష్కరించి పనిదినాలకు సంబంధించిన వేతనాలు అందేలా చూడాలి.

- బచ్చలకూరి విజయ (వేములపల్లి)



**ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం**

ఉపాధికూలీల జాబ్‌కార్డు, అకౌంట్, ఆధార్, అథంటికేషన్ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్‌సెల్ ఏర్పాటు చేశాం. ప్రతీవారం చెల్లింపుల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. తమ దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించాం. జిల్లాలో కొన్ని చోట్ల బ్యాంకు ఖాతా, ఆధార్ అథంటిక్ వేరిఫికేషన్ సమస్య ఉన్నట్లుగా తెలిసింది. ఆయా మండలాలపై ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యను పరిష్కరిస్తాం.

- నాగిరెడ్డి, డీఆర్‌డీవో పీడీ, నల్లగొండ



## కాంగ్రెస్, బీజేపీలు యువతను మోసగించిన పార్టీలు



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 22 : కాంగ్రెస్, బీజేపీ రెండూ యువతను మోసగించిన పార్టీలేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. చట్టసభల్లో ప్రశ్నించే గొంతుక విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డి అన్నారు. ఇన్నేళ్లు ప్రశ్నించే గొంతుకన్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మోసగించే గొంతుకగా మారాడని ఎద్దేవా చేశారు. యూట్యూబ్ ఛానెల్ ముసుగులో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డ మల్లన్న భాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. మల్లన్నపై పెట్టిన కేసుల్లో అత్యధికంగా మహిళలు పెట్టినవే అని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మల్లన్నకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. బీజేపీ అభ్యర్థి ఎన్నికల పోటీలో ఉన్న ప్రజల్లో లేరని తెలిపారు. ఎన్నికలు ఉన్నప్పుడే కనిపించి ఆ తర్వాత కనుమరుగయ్యే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్‌కుమార్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, గండూరి ప్రకాష్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు

**పెంచికల్‌దిన్న వైద్యాధికారికి షోకాజ్ నోటీసు**



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కోటా చలం

నేరేడుచర్ల, మే 22 : అనుమతులు లేని ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కోటాచలం అన్నారు. బుధవారం నేరేడుచర్ల పీహెచ్‌సీని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేని ల్యాబ్‌లు నిర్వహిస్తే సీజ్ చేస్తామన్నారు. పెంచికల్‌దిన్న వైద్యాధికారి సీతామహాలక్ష్మి ఎటువంటి అనుమతి లేకుండా రెండు రోజులుగా విధులకు గైర్హాజరు అవుతుందని, విధులకు సరిగా హాజరుకావడం లేదని విచారణలో తేలిందన్నారు. దీంతో ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన వెంటనే రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని ఆదేశించారు. సం తకాలు చేయకుండా ఎటువెళ్లినా వారు విధులకు హాజరుకానట్లే అన్నారు. చింతలపాలెం, పాలకవీ డు, మద్దిరాల మండలాలోక్ట్ల పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి వైద్యాధికారులను నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగిణి, సౌమ్యశ్రీ, నర్సయ్య ఉన్నారు.

## వానాకాలం నుంచే ఫసల్ బీమా యోజన అమలు




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నల్లగొండ, మే 22 : ఈ వానాకాలం నుంచే రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం అములులోకి రానుందని హైదరాబాద్ వ్యవసాయ శాఖ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా జేడీఏ పీ శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఫసల్ బీమా పథకంపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి, టమాట, కంది పంటలకు యాసంగిలో వరి, వేరుశనగ పంటలకు ఈ బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఇందుకోసం రైతులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న పంటలకు మాత్రమే వర్తిస్తుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అడవీ జంతువులతో పంట నష్టం జరిగినా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌బాబు,యాదాద్రి భువనగిరి జిల్లా జేడీఏ అనురాధ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ట్రైనర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ బియ్యం పక్కదారి**

- ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వ్యాపారులు
- రూ.8 నుంచి రూ.10 వరకు డీలర్ల వద్ద కొనుగోలు
- తనిఖీల్లో దొరక్కకుండా జాగ్రత్తలు

8

**పూర్ణాహుతితో పరిసమాప్తి**



మూడు రోజులుగా కొనసాగుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు పూర్ణాహుతితో పరిసమాప్తం అయ్యాయి. అంతకు ముందు సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ స్వామి వారిని అలంకరించి ఊరేగించారు.

7

**వైభవంగా ఎదుర్కోళ్లు**



మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఎదుర్కోలు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తిరుకల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

## ఎన్నికల్లో పీవో, ఏపీవోల బాధ్యత కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), మే 22 :జిల్లాలో శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక నేపథ్యంలో పీవో, ఏపీవోల బాధ్యతలు కీలకమని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉపఎన్నికపై పీవోలకు, ఏపీవోలకు ఇస్తున్న శిక్షణ తరగతుల సందర్భంగా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి మాట్లాడారు. పోలింగ్ ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలో 51,497 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని 71 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. పోలింగ్ కోసం రిజర్వ్‌తో కలిపి 85 మంది పీవోలు, 85 మంది ఏపీవోలు, 170 మంది ఓపీవోలుగా సిబ్బందిని నియమించామన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నిక జరుగుతుందని ఎన్నికల్లో 52 మంది పోటీ చేస్తున్నందున జంబో బ్యాలెట్ బాక్స్ ఏర్పాటుచేశామన్నారు. బ్యాలెట్ పేపర్ పెద్దగా ఉన్నందున ఓటువేసిన తర్వాత జాగ్రత్తగా మడిచి బ్యాలెట్ బాక్స్‌లో వేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు, తాగునీరు, ఎలక్ట్రిసిటీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న జోన్‌లో ప్రాధాన్య క్రమంలో నెంబర్లుగాని, రోమన్ సంఖ్యలు వేస్తే ఓటు చెల్లుతుందని తెలిపారు. అక్షరాలు, టిక్కులు, సంతకాలు చేసిన ఓట్లు చెల్లవన్నారు. ఓటు వేసిన తర్వాత ఓటరు ఎడమ చేతి మధ్య వేలుకు ఇంక్‌తో పోలింగ్ సిబ్బంది గుర్తుపెట్టాలని, అందులైన ఓటర్లకు వారి వెంట వచ్చిన సహాయకులతో ఓటు వేయించాలని తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌తో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి జడ్పీ సీఈవో అప్పారావు, రిపోర్టింగ్ నోడల్ అధికారి, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, జిల్లా రవాణా అధికారి సురేష్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి లక్ష్మానాయక్, ఆర్డీవో వేణుమాధవ్, మాస్టర్ ట్రైనర్ రమేష్, శ్రీనివాసరాజు, వెంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### 13మంది ఓపీవోలు సస్పెండ్

ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరుకానీ 13మంది ఓపీవోలపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు కలెక్టర్ వెంకటరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నిర్వహించిన శిక్షణకు 13 మంది ఓపీవోలు గైర్హాజరయ్యారు. వీరిని తక్షణమే సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం

ప్రతీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఉచితంగా యూనిఫాం అందజేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో నూతన యూనిఫాంలను అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో 11, 576 యూనిఫాంలు కుట్టి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వతేదీలోపు 100శాతం పూర్తిచేయాలన్నారు. ఎంఈవోల ద్వారా ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 41,427 మంది విద్యార్థులకు మొదటి జత పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ఏర్పాటుచేసిన మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాల ద్వారా స్కూల్ యూనిఫాంలను కుట్టించి ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదే తీరులో ధాన్యం కొనుగోళ్లలో కూడా బాగా పనిచేశారని ట్యాబ్ ఎంట్రీ ద్వారా రైతుల ఖాతాలో నగదు అతి తక్కువ సమయంలో వేశారని కొనియాడారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై అనుభవం లేదు

**బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ**




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

నల్లగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై అనుభవం లేదని, తెలంగాణ పాలనపై ఆయనకు పట్టు దొరకడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో బాగంగా బుధవారం నల్లగొండకు వచ్చిన ఆమె నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణను ఎలా పాలించాలో తెలియని స్థితిలో రేవంత్ ఉన్నారన్నారు. అధికారంలోకి కొత్తగా వచ్చామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, కానీ దేశాన్ని, ఉమ్మడి ఏపీని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్‌కు అధికారం కొత్త ఎలా అవుతుందన్నారు. చిన్న రాష్ట్రాన్ని పాలించలేక బోర్లా పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆధారాలు, రుజువులు లేకుండా బీజేపీ ఎమ్మెల్యేలు తెలంగాణ మంత్రులపై ఆరోపణలు చేయడం లేదని, సంచలనాలకు తమ పార్టీ పాకులాడదని, సంచలనాలకు ప్రాధాన్యమిచ్చేదే రేవంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ డిజిట్ స్థానాలు గెలవబోతున్నామని, అందులో హైదరాబాద్ కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పులపాలైందని, పూటకో మాట మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్ల అప్పులయ్యాయనే అంశంపై అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ఆమె నిలదీశారు. ఎన్నికలకు ముందు ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తామని, ఇప్పుడు కేవలం సన్న ధాన్యానికేనని మాట మార్చారని, రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని ఇవ్వడం లేదని, విద్యార్థులకు రూ. 5లక్షల క్రెడిట్ కార్డులు ఒక్కరికైనా ఇవ్వలేదన్నారు. నిలదీశారు. యువత తరుపున కొట్లాడేందుకు ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు పెన్నా అనంతరామశర్మ మృతి

● తుదిశ్వాస విడిచే వరకు సీపీఎంలోనే కొనసాగిన నాయకుడు ● నల్లగొండలోని స్వగృహంలో కన్నుమూత


పెన్నా అనంతరామశర్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**నల్లగొండ రూరల్, మే 22:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పెన్నా అనంతరామశర్మ(90) మృతి చెందారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామగిరిలోని తన స్వగృహంలో వయోభారంతో బుధవారం రాత్రి 9 గంటలకు మృతిచెందారు. 1934వ సంవత్సరంలో నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పిట్టంపల్లిలో గ్రామంలో పెన్నా సీతయ్య, పిచ్చమ్మలకు అనంతరామశర్మ జన్మించారు. చిన్ననాటి నుంచి ప్రగతిశీల భావాలతో పెరిగిన ఆయన నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం వైపు మళ్లారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ కీలకపాత్ర పోషించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన 20 ఏట కమ్యూనిస్టు పార్టీలో చేరి పూర్తికాలం కార్యకర్తగా మారారు. సీపీఎంలో కీలక నేతగా ఎదిగారు. అంతేకాక నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలందించారు. సీపీఎం విస్తరణ కోసం నిరంతరం, అహర్నిశలు కృషి చేశారు. అదేవిధంగా రైతు, వ్యవసాయ, కార్మిక ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారు. సీపీఎంలో ఉద్యమ నిర్మాతలైన వీఎన్, మల్లు స్వరాజ్యం, నర్రా రాఘవరెడ్డిలతో పార్టీ వ్యవహారాలతో పాటు, పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారు. సీపీఎం నల్లగొండ డివిజన్ కార్యదర్శి బాధ్యతలను నిర్వర్తించారు. అంతేకాకుండా రాష్ట్ర, జిల్లా కమిటీల్లో కీలక సభ్యుడిగా ఉన్నారు. బ్రాహ్మణ కుటుంబలో జన్మించిన ఆయన స్వాతంత్ర్య పోరాటం, సీపీఎం వ్యవహార, పోరాటాల్లో పాల్గొని అలుపెరుగని నాయకుడిగా ఎదిగారు. మలి వయస్సులో కూడా స్వాతంత్ర్య సమరయోధుల, పింఛన్ల కోసం పోరాటం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ల సంఘం కన్వీనర్‌గా ఆయన వ్యవహరించారు.

నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతానికి చివరివరకు కట్టుబడి ఉన్నారు. ప్రజాస్వామ్యంపై అచంచెల విశ్వాసం ప్రదర్శిస్తారు. తీవ్ర వయోభారంలోనూ ఈ నెల 13వ తేదీన జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆయన తన స్వగ్రామం పిట్టంపల్లి వరకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరామశర్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతి చెందిన సమయంలో వారు ఎవరూ అందుబాటులో లేరు. కుమారుడు సింగపూర్‌లో ఉండగా, ఒకరు ఆస్పత్రిలో ఉన్నారు. కుమార్తె, కుమారుడు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. అనంతరామశర్మ మృతిచెందిన సమయంలో పార్టీ నాయకులు అక్కడే ఉండటంతో విషయాన్ని వాళ్లకు తెలిపారు. కుమారులు, కుమార్తె వచ్చే వరకు అనంతరామశర్మ మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచనున్నట్లు బంధువులు తెలిపారు. గురువారం 9 నుంచి 11 గంటల తర్వాత సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం మృతదేహాన్ని ఉంచనున్నారు. అనంతరం స్వగ్రామమైన పిట్టంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### సంతాపం తెలిపిన సీపీఎం నాయకులు

స్వాతంత్ర సమరయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పెన్నా అనంతరామశర్మ మృతి విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరామశర్మ మృతదేహంపై ఎర్రజెండాను కప్పారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, మల్లు లక్ష్మి, నారాయణ, ప్రభావతి, సయ్యద్ హాశం, సలీం, దండెపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి ఉన్నారు. అనంతరామశర్మ మృతికి మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి సంతాపం తెలిపారు.

# నృసింహుడి జయంత్యుత్సవాలు పరిసమాప్తి



ప్రధానాలయంలో కలశాలు తీసుకెళ్తున్న భక్తులు

**భువనగిరి అర్బన్, మే 22:** సహస్ర కలశాలల్లో మంత్ర పూర్వ జలాలు.. సుగంధ పరిమళద్రవ్యాలతో భక్తి పూర్వకంగా సహస్ర కలశాభిషేకం, పూర్ణాహుతి.. రాత్రి వేళ నృసింహుడి జయంతి, ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠితో ఉత్స పరిసమాప్తి కార్యక్రమాలతో జయంత్యుత్సవాలు ముగిశాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న స్వామివారి జయంత్యుత్సవాలు బుధవారం పూజా కార్యక్రమాలతో పరిసమాప్తి అయ్యాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆగమశాస్త్రరీతిలో వెయి కళాశాలను వరుస క్రమంలో పేర్చి మంత్ర జలం, సుగంధ ద్రవ్యాలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. వేద పండితుల వేద పారాయణాలు, రుత్వికుల మంత్రోచ్ఛరణల మధ్య నూతన వస్త్రాలు కప్పిన కలశాల్లో పంచామృతాలు కలిపి సహస్ర కళశాభిషేక ఘట్టం నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో వేద పారాయణాలు పఠించగా నిత్య ఆరాధనల అనంతరం రుగ్వేర ద్వార యాగశాలలో ఉదయం 7గంటల నుంచి నిత్య హవనాలు, మూలమంత్ర జపాలు, మూర్తి మంత్ర పఠనాలు, లక్ష్మీసూక్తలు, విష్ణు సహస్ర పారాయణాలు 9గంటల నుంచి 9.30గంటల వరకు మహా పూర్ణాహుతి, కలశాభిషేక క్రతువుల్లో, అలాగే స్వామివారి తిరువీధి సేవలో దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతురావు దంపతులు పాల్గొన్నారు. రుత్వికులు, అర్చకులు, వేద పండితుల పారాయణాలు, ఆస్థాన విద్యాంసుల మంగళవాయిద్యాల నడుమ సాయంత్రం జరిగిన పూజల్లో నృసింహ జయంతి, ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో శాస్త్రోక్తంగా జయంతోత్సవాల్లో భాగంగా నిత్య హవనములు, మూలమంత్ర జపాలు, పూర్ణాహుతి, అష్టోత్తర శతఘటాభిషేకం పూజలు చేపట్టగా, సాయంత్రం 7గంటలకు నృసింహ జయంతి, ఆవిర్భావం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠితో ఉత్సవ పరిసమాప్తి చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్క. రాయణీ నరసింహమూర్తి దంపతులు, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఉప ప్రధానార్చకుడు బట్టర్ సురేంద్ర చార్యులు, మాధవచార్యులు, ఏఈవోలు దూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమేష్, గజ్వేల్లి రఘు, పర్య వేక్ష కులు రాజన్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీరామ భక్త భజన, శ్రీయాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మహిళ భజన మండలిలచే భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఉమ్మడి లక్ష్మణాచార్య భక్తి సంగీతం, కౌముది నృత్యాలయంచే శ్రావణీ కౌముది, శ్రీమయూరి నాట్య కళాసాధనచే రమ్య, మౌనిక కూచిపూడి నృత్యం, మధురధ్వనీ బృందంచే శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శన చేపట్టారు. కొండపైన రవీంద్ర లంగ్ కేర్ సెంటర్ డాక్టర్ ఎన్. రవీంద్ర, డాక్టర్ ప్రవళిక, కల్పన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

### స్వామివారి సేవలో ఎంపీ లక్ష్మణ్

రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేశ్వర్లు, కర్రె ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి ఆర్జిత సేవలు

నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హోమం తదితర ఆర్జిత సేవలు గురువారం పునః ప్రారంభం కానున్నాయి. స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా 9గంటలకు ప్రారంభించాల్సిన బ్రేక్ దర్శనాలు ముందస్తుగా 8.30గంటలకే ప్రారంభం కాగా 9.30గంటల వరకు బ్రేక్ దర్శనాలకు అవకాశం కల్పించారు. ఆలయ అధికారులు కూడా ఆ తర్వాత 10.30గంటలకు భక్తులకు దర్శనాలకు అనుమతించారు. సుమారు రెండు గంటలు దర్శనాల కోసం క్యూలైన్లల్లోనే ఎదురుచూశారు. లోనికి అనుమతించడంతో ఒక్కసారిగా దర్శనాల తాకిడి పెరిగిపోయింది. సెల్‌ఫోన్ ఆలయంలోకి తీసుకెళ్తానని దేవాదాయ



కమిషనర్ ఎం. హనుమంతురావు వాహన డ్రైవర్ సిబ్బందితో వాగ్వాదం చేశారు. తాను కమిషనర్ డ్రైవర్‌ను తీసుకెళ్తానని మొండికేయడంతో సిబ్బంది ఫిర్యాదుతో ఆలయంలోకి సెల్‌ఫోన్లు నిషేదం విధించినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో డి. భాస్కరశర్మ నచ్చజెప్పారు.

### శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. అదే విధంగా కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.35,64,770ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో నూతన వస్త్రాలు కప్పి కలశాభిషేకాలు పేర్చిన దృశ్యం

## కల్యాణానికి ముస్తాబు..



కల్యాణానికి ముస్తాబైన మట్టపల్లి ఆలయం

**మఠంపల్లి, మే 22:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీ నరసింహుని క్షేత్రంలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చనలు, ద్రవిడ ప్రబంధ సేవాకాలము, మల్లికాపుష్ప సహస్ర నామార్చన, లక్ష మల్లికా పుష్ప పూజ, సాయంత్రం నాదస్వర కచేరి అనంతరం ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్లు బుధవారం వైభవంగా నిర్వహించారు. యాజ్ఞీకులు శ్రీమాన్ బొర్రావాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో శ్రీమాన్ పరాశరం వెంకటాచార్యులు, నారాయణం హరికిరణాచార్యులు బంధ్యం పాల్గొని పూజలు నిర్వహించారు. మట్టపల్లి వాసునికి పెళ్లి కొడుకు, భూదేవి, చెంచులక్ష్మీ అమ్మవార్లను పెళ్లి కూతుర్లుగా అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి గురువారం తెల్లవారుజాము న రెండు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పాలక వర్గం ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్ తెలిపారు.

### బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు

మట్టపల్లి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం 6గంటలకు సుప్రభాతం, ప్రాతఃకాలార్చనలు, 7గంటలకు ధృవ స్వామివారికి పంచామృతాభిషేకము, ఉదయం 9గంటలకు రాజశేఖరుని లక్ష్మీపతిరావు దంపతులచే మల్లికాపుష్ప సహస్ర నామార్చనలు, మట్టపల్లి రామయ్య దంపతులచే మూర్తి లక్ష్మీనరసింహామూర్తి, జానపాటి సీతారామశాస్త్రీ ఆధ్వర్యంలో లక్షా మల్లికా పుష్ప పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10గంటలకు ఎదుర్కోలు మహోత్సవం, సాయంత్రం 4గంటలకు నాదస్వర కచేరి, 5గంటలకు శ్రీమాన్ ముడంబై శ్రీనివాసాచార్యులు, రాఘవలక్ష్మీ, మనోహర్ బృందంతో భక్తి సంగీతం, 6గంటలకు విజయవాడ వారిచే సంగీత విభావరి, రాత్రి 8గంటల నుంచి 9 గంటల వరకు ధూళిపాళ్ళ శివరామకృష్ణ భాగవతర్ గుంటూరు వారిచే గజేంద్రమోక్షము-హరికథ, రాత్రి 10గంటలకు లక్ష్మీనరసింహ నామ సంకీర్తన, రాత్రి 11గంటలకు శ్రీరామతీర్థ సేవాశ్రమము వారిచే శ్రీలక్ష్మీ నరసింహ నామ సంకీర్తనతో పాటు వీరబ్రహ్మేంద్ర స్వామి,లక్ష్మీనరసింహ్మా, వై.ఎస్ఆర్ కోలాట బృందాలచే కోలాట ప్రదర్శన పోటీలు నిర్వహించారు. రాత్రి 12గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజలక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్లు ఉత్సవాలను వేదమంత్ర పఠనంతో సమస్త మంగళవాయిద్యాలతో కల్యాణ మం డపం వరకు వేలాదిమంది భక్తజనసంద్ర నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు.

## కామాఖ్య ఆలయంలో మంత్రి ఉత్తమ్ పూజలు



**హుజూర్‌నగర్, మే 22:** అస్సాంలోని గౌహతిలో గల కామాఖ్య దేవాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1500 సంవత్సరాల నాటి కామాఖ్య దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. సందర్భంగా గౌహతి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రెకిబుద్దీన్ అహ్మద్ మంత్రి ఉత్తమ్ దంపతులకు స్వాగతం పలికారు. దేవాలయంలో అర్చకులచే ఆశీర్వచనాలు అందించారు.

## బంగారు ఆభరణాలు దొంగతనాలు చేస్తూ..

**కోదాడ, మే 22:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంతో పాటు పలు బస్ స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను కోదాడ పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కావలి మండలం బుడంగుంట గ్రామానికి చెందిన కర్రెద్దుల లలిత దొంగతనాలు చేసేది. ఈ నెల 18వ తేదీన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహిళ కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా ఆమె మెడలో ఉన్న చంద్రహారం, చెవి దిద్దులు, ముక్కుపొడుక, ఉంగరం, రూ.30వేల నగదు అపహరించింది. వాటిని కోదాడ పట్టణంలోని ఓ బంగారు ఆభరణాల దుకాణంలో బుధవారం అమ్మేందుకు తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బంగారం, నగదు, దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో మహిళపై 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. పలుమార్లు జైలు శిక్ష, అనుభవించినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి రూ.రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కోదాడ రూరల్, మే 22:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రాలోని వత్సవాయి మండలకేంద్రానికి చెందిన షేక్ సైదులు(60) రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఢీకొనడంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా ఆయన పేరు, చిరునామా కనుగొన్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**మిర్యాలగూడ అర్బన్, మే 22:** తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ స్థానికంగా నివాసముంటున్న రవి కుటుంబసభ్యులు వేసవి సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచుకున్న రూ.30వేల నగదుతోపాటు అరతులం బంగారం, 40తులాల వెండి సామాగ్రి ఎత్తుకెళ్లారు. కుటుంబసభ్యులు బుధవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## కుటుంబ కలహాలతో..

**తుర్కపల్లి, మే 22:** కుటుంబ కలహాలతో గృహిణి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తకీయోద్దీన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తాపురం గ్రామానికి చెందిన మొగిరెడ్డి రాజిరెడ్డికి భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌కు చెందిన స్మృతి(32)తో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరి సంసారం కొన్ని రోజులుగా సాఫీగా జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా మొగిరెడ్డి స్మృతి బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసు కొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.

## 'నీ కుమార్తెను కిడ్నాప్ చేశాం'

**● విడిచిపెట్టాలంటే రూ.50వేలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడికి ఫోన్**

**చౌటుప్పల్ రూరల్ మే 22:** 'నీ కుమార్తెను కిడ్నాప్ చేశాం.. రూ.50వేలు ఫోన్ పే చేస్తేనే విడిచిపెడుతాం' అంటూ ఓ మోసగాడు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఓ నాయకుడికి ఫోన్ చేసి బెదిరించాడు. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ చిన్న కుమార్తె రుషిక ఢిల్లీలో చదువుకుంటోంది. మంగళవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అదే సమయంలో ఒక ఫేక్ వాట్సప్ కాల్ నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. మీ కూతురును కిడ్నాప్ చేశానని.. విడిచిపెట్టలంటే రూ.50 వేలు ఫోన్‌పే చేయాలని ఫోన్ కట్‌చేశాడు. దీంతో కంగారు పడిన శ్రీనివాస్ కూతరు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందాడు. కొద్ది సేపటి తర్వాత కుమార్తె రుషిక ఫోన్ చేసి తాను క్షేమంగానే ఉన్నట్టు చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నాడు. ఈ సంఘటనపై శ్రీనివాస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# వైభవంగా నరసింహస్వామి కల్యాణం

**కోదాడ రూరల్, మే 22:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని యర్రవరం గ్రామంలో వెలసిన శ్రీదూలగుట్ట బాల ఉగ్ర నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం రెండో రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అష్ట కలశ స్థాపన, పంచామృత, పంచ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమాలు, నరసింహస్వామి సుదర్శన మూలమంత్ర జపాలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు ముత్యాల పందిళ్ల మధ్య వేదమంత్రాలతో మంగళవాయిద్యాలతో చెంచులక్ష్మి రాజ్యలక్ష్మి సమేత నరసింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బాశబోయిన భాస్కర్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### పట్టువస్త్రాల సమర్పణపై ..

మండలంలోని యర్రవరం గ్రామంలో బాల ఉగ్ర నరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడంపై కొద్దిసేపు వివాదం నెలకొంది. ఆలయ ప్రారంభ సమయంలో తన కుమారుడు పండుస్వామి వాక్కు ప్రభావంతోనే ఈ దేవాలయం ఎంతో అభివృద్ధి చెందుతుందని పండుస్వామి తండ్రి సోమపంగు హుస్సేన్ అన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే స్వామివారి కల్యాణానికి తాము పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పిస్తామని, కమిటీ ఏర్పాటు సమయంలో ఒప్పందం జరిగిందన్నారు. చైర్మన్ నలజాల జగన్నాథం ఇంటి నుంచి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు తీసుకురావడానికి నిరాకరించడంతో కొంతసేపు వివాదం జరిగింది. తాము పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించిన తర్వాతే కల్యాణం జరిపించాలని పట్టుపట్టారు. దీంతో కొంతసేపు స్వామివారి కల్యాణానికి అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఇరువర్గాలతో చర్చించిన తర్వాత అంగీకారానికి రావడంతో కల్యాణం నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

# చెరువుకుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**● అమ్మమ్మ ఇంటికి వచ్చి సరదాగా ఈతకు వెళ్లిన చిన్నారులు ● నల్లగొండ జిల్లా దామరచర్లలో ఘటన**

**దామరచర్ల, మే 22:** ఈతకు వెళ్లి చెరువు కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఇండ్ల నాగరాజు దామరచర్ల మండల కేంద్రంలో స్థిరపడ్డాడు. ఇళ్లలో టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడైన నాగధనుష్ (11) మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. దామరచర్ల మండల కేంద్రంలో ఈ నెల 23వ తేదీన ముత్యాలమ్మ తల్లి తిరునాళ్లు జరిగాయి. ఆ తిరునాళ్లకు పల్నాడు జిల్లా మాచవరం మండలం యామారం గ్రామానికి చెందిన నాగరాజు మరదలి కుమారుడు పెద్దిశెట్టి సాత్విక్ (8) దామరచర్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. దీంతో వరుసకు సోదరుడు అయిన నాగధనుష్, సాత్విక్‌లు ఇరువురు కలిసి అమ్మమ్మ ఇంటి నుంచి ఇంటి సమీపంలోని మరో ఇద్దరు బాలురతో కలిసి గ్రామ సమీపంలోని నాగులచెరువు వద్ద గల నీటికుంట వద్దకు వెళ్లారు. నాగధనుష్, సాత్విక్ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగడంతో ఈత రాక ఇరువురు నీటిలో మునిగిపోయారు. దీంతో ఒడ్డున ఉన్న మరో ఇద్దరు బాలురు కేకలు వేసి సమీపంలోని వారికి చెప్పడంతో వారు నీటి కుంట వద్దకు చేరుకున్నారు.



ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన చెరువు కుంట



వెంటనే నీట మునిగిన ధనుష్, సాత్విక్‌లను బయటకు తీశారు. అప్పటికే నాగధనుష్ ఊపిరాడక మృతి చెందగా సాత్విక్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

# ప్రైవేట్ వ్యక్తితో విద్యుత్ లైన్ పనులు

**● సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకోని సిబ్బంది ● ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆఫ్ చేసి పనులు ● తీగలు సరిచేసే క్రమంలో వ్యక్తికి విద్యుదాఘాతం**

**గుండాల, మే 22:** విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది ఓ ప్రైవేట్ వ్యక్తిని స్తంభం ఎక్కించి మరమ్మతులు చేయిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... 15రోజుల క్రితం కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ లైన్ ధ్వంసమైంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో కాలనీవాసులు రెండు రోజులు క్రితం విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం లైన్ సరిచేసే క్రమంలో సిబ్బంది సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకోకుండా కాలనీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఏబీ స్విచ్ ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు చేస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కాలనీకి చెందిన విద్యుత్ మరమ్మతుల పని తెలిసిన అన్నెపర్తి ప్రవీణ్‌ను సిబ్బంది స్తంభం ఎక్కించి విద్యుత్ లైన్ సరి చేయిస్తున్నారు. స్తంభం ఎక్కిన ప్రవీణ్ లైన్‌కు విద్యుత్ సరఫరా అవుతోందని సిబ్బందికి చెప్పాడు. తీగల నుంచి దూరంగా రావాలని అతనికి సూచించారు. ప్రవీణ్ స్తంభం నుంచి నిచ్చెన ద్వారా కిందికి దిగే సమయంలో తలకు వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గుయ్యాడు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదే కాలనీలో మరమ్మతు పనులు జరుగుతుండడంతో కుటుంబసభ్యులు, విద్యుత్ సిబ్బంది కలిసి గాయపడిన ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీకి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. గాయపడిన ప్రవీణ్‌కు నష్టపరిహారం చెల్లించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఎం నాయకులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మోత్కూరు ఏడీఈ బాలునాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఏడీఈ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గాయపడిన ప్రవీణ్‌కు చికిత్స చేయిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఎండీ కలీల్, మద్దెపురం రాజు, యాదగిరి పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

# నేడు బుద్ధవనంలో బుద్ధ జయంతి ఉత్సవాలు

**నాగార్జునసాగర్, మే 22:** ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్ కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనంలో 2568వ బుద్ధ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు బుద్ధవనం అధికారులు తెలిపారు. బుద్ధ జయంతి ఉత్సవాలకు బుద్ధవనాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలకు పర్యాటక శాఖ ఎండీ రమేష్‌నాయుడుతో పాటు మైసూరుకు చెందిన బౌద్ధ భిక్షువులు, మాంక్‌లు, బౌద్ధ అభిమానులు హాజరుకానున్నట్లు బుద్ధవనం అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాలకు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 10 గంటలకు హాజరై బుద్ధుని పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకొని గురువారం బుద్ధవనంలోకి అందరికీ ఉదయం నుంచి రాత్రి వరకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.

## ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని..



ఆందోళన చేస్తున్న మహిళ

**రాజాపేట, మే 22:** ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని భార్య భర్త ఎదుట ఆందోళన చేసింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన రేకులపల్లి మహిపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన యువతితో 2021లో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారి 2021 జూన్ 6వ తేదీన సింహాచలం దేవస్థానంలో ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో మరోసారి పెళ్లి చేసుకున్నారు. యువతి నుంచి 24 తులాల బంగారం, రూ.70లక్షల నగదుతో పాటు మోత్కూరులో ఉన్న ప్లాట్లు తీసుకొని తనకున్న అప్పులు తీర్చుకున్నాడు. 15 రోజుల తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనను మోసం చేశాడని హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కొంతకాలంగా మహిపాల్‌రెడ్డి మొహం చాటేస్తుం డడంతో తనకు న్యాయం చేయాలని మహిపాల్‌రెడ్డి స్వగ్రామమైన బూరుగుపల్లిలోని మహిపాల్‌రెడ్డి ఇంటిముందు వంటా వార్పుతో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం నిరసన దీక్ష చేపట్టింది. మహిపాల్‌రెడ్డి తల్లి పద్మ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లడంతో తాళం వేసి ఉన్న ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, కొంతమంది నాయకులు యువతీ దీక్షకు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దీక్ష విరమింపజేసేందుకు యత్నించారు. గురువారం మహిపాల్‌రెడ్డిని రప్పించి న్యాయం చేస్తామని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో యువతి కుటుంబ సభ్యులు దీక్షను విరమించారు.

## కట్టంగూరు జడ్పీటీసీపై కేసు నమోదు

**కట్టంగూరు, మే 22:** కట్టంగూరు జడ్పీటీసీ తరాల బలరాం తన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని మండలంలో ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన తరాల మంగ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీటీసీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు. బాధితురాలు తరాల మంగ 2014లో తరాల బలరాం వద్ద చిట్టి వేసి ప్రారంభంలోనే చిట్టి రూ.3,38,000లు ఎత్తుకుంది. అందుకు షూరిటీగా మంగకు చెందిన అదే గ్రామంలోని సర్వేనెంబర్ 348/1లో గల ఎకరం ఐదు గుంటల భూమిని తరాల బలరాం ఆమె నుంచి ఏజీపీఏ చేయించుకున్నాడు. చిట్టి డబ్బులు వాయిదాలు పూర్తిగా చెల్లించినా కూడా ఏజీపీఏను రద్దు చేసి తన భూమి నాకు ఇవ్వకుండా, తన ప్రమేయం లేకుండానే భార్య పేరు మీదకు మార్చుకున్నాడని ఆరోపించాడు. తనను మోసం చేసిన తరాల బలరాంపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే విషయమై జడ్పీటీసీ విలేకర్లతో మాట్లాడుతూ తాను భూమి కొనుగోలు విషయంలో చట్టపరంగానే వ్యవహరించానని తాను ఎవరినీ మోసం చేయలేదని రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు.

## మృతదేహంతో ఆందోళన

**భువనగిరి అర్బన్, మే 22:** యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో వ్యక్తి మృతదేహంతో బుధవారం ఆందోళన చేశారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురం వద్ద మంగళవారం జరిగిన బైక్ ప్రమాదంలో సాదువెల్లికి చెందిన గోలి శ్రీనివాస్(38) మృతిచెందాడు. శ్రీనివాస్ మృతికి కారణమైన యాదగిరిగుట్ట సుభాష్ నగర్‌లోని జిల్లా భరత్ ఇంటి ఎదుట మృతదేహంతో మృతుడి బంధువులు ధర్నా చేపట్టారు. యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించి శాంతింపజేశారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్యా బిడ్డలు ఒంటరి వారయ్యారని బంధువులు వాపోయారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత మృతదేహాన్ని సాదువెల్లి గ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

# రేషన్ బియ్యం పక్కదారి



సూర్యాపేటలో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే (ఫైల్ ఫొటో)

- పాలీష్ చేసి సన్న రకాల్లో మిళితం
- అధికారుల కనుసన్నల్లోనే దందా
- పెన్‌పహాడ్ మండలంలో కీలక వ్యాపారి
- ఇటీవల వరుసగా 395క్వింటాళ్ల ధాన్యం స్వాధీనం

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

జిల్లాలో కొంతమంది వ్యాపారులు రేషన్ బియ్యం దందా చేస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద బియ్యం కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. రేషన్ దుకాణంలో ఒక్కో లబ్ధిదారుడి కోటాకు 10కిలోల బియ్యం వస్తుండగా, డీలర్ల సహకారంతో కిలోకు రూ.10 చొప్పున రూ. 100కు డీలర్లకు పలువురు విక్రయిస్తున్నాడు. ఇలా అక్రమంగా పలువురి నుంచి కొనుగోలు చేసిన రేషన్ డీలర్లు కిలో రూ.15 చొప్పున బియ్యం అక్రమ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో కొంత మంది వ్యాపారులు ఇదే దందాను కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వాహనాలు అడపాదడపా పట్టుబడినా వ్యాపారం ఆగడం లేదు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం వస్తుందని అధికారులు చెబుతున్నా, వాస్తవానికి జిల్లాలోని అన్ని మండలాల్లో బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులు ఉన్నారు. రేషన్ బియ్యాన్ని ఆటోల్లో తరలించి ఒక ప్రాంతంలో డంపు చేసి లారీలు, డీసీఎం వాహనాల్లో కాకినాడ సమీపంలోని యానాం, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే సమయంలో పౌరసరఫరాల శాఖ అధికారులకు, పోలీసుల తనిఖీలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. పెన్‌పహాడ్ మండలంలో కీలక వ్యాపారి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

జిల్లాలో 90శాతం రేషన్ బియ్యాన్ని వినియోగదారులు కొనుగోలు చేయడంలేదు. గొర్రెలు, నాటు కోళ్లు, పశువులు ఉన్న వారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగిలినవారికి కిలోకి రూ.8నుంచి రూ.10లు డీలర్లు చెల్లించి తమ దుకాణంలోని నిల్వ ఉంచుతున్నారు. ఆటోలో రవాణా చేయడానికి సరిపడా బస్తాల బియ్యం సమకూరితే బియ్యం హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. పోలీసులు మాత్రం అప్పుడప్పుడు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని మూడు రోజుల క్రితం చివ్వెంల మండలం చందుపట్ల గ్రామంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లారీలో 20టన్నుల రేషన్ బియ్యం ఉండడంతో అధికారులు కూపీలాగారు. ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామం నుంచి హైదరాబాద్‌కు బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేసి, షేక్‌మీరా అలీకి చెందిన మూడు వాహనాల్లో తరలించడానికి సిద్ధంగా 10టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసి, నిత్యావసర వస్తువుల దుర్వినియోగ చట్టం, చీటింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి, నిందితుల నుంచి 95క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### సమాచారం రాగానే దాడులు చేస్తున్నాం

అనుమానం వచ్చిన రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. లబ్ధిదారులకు బియ్యం ఇచ్చే సమయంలో దుకాణాలను తనిఖీ చేయాలని టాస్క్‌ఫోర్స్, ఆర్ఐ, డీటీలకు సూచించాం. బియ్యానికి బదులు నగదు పంపిణీ చేసినట్లు తెలిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి

### వ్యాపారుల్లో మారిన పంథా..

లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని డీలర్లు, బియ్యం దందా చేసే వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో బియ్యం సమకూరితే కాకినాడ, యానాంకు తరలిస్తున్నారు. కొంత మంది టిఫిన్ సెంటర్లు, హోటల్స్ కూడా విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ సరఫరాకు గతంలో జిల్లా కేంద్రంతో చివ్వెంల మండలం కుడకుడ గ్రామం అడ్డాలుగా ఉండేవి. ఆ ప్రాంతాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, పౌరసరఫరాల విజిలెన్స్ బృందాలు, పోలీసులు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో తరచుగా తనిఖీలు చేయడంతో మారుమూల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో నేరేడుచర్ల విద్యార్థుల ప్రతిభ



గోల్డ్ మెడల్ అందుకుంటున్న కుంకునూరి రేణుసుప్రియ

నేరేడుచర్ల, మే 22: షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోవా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19న నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ -2024 ఛాంపియన్‌షిప్‌లో నేరేడుచర్ల పట్టణంలోని బోడయ్యగూడెంకు చెందిన కుంకునూరి రేణుసుప్రియ, కుంకునూరి కార్తికేయ సిద్ధార్థ్ అండర్-12 విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తల్లిదండ్రులు కుంకునూరి శివకుమారి, నాగేశ్వరావు తెలిపారు. ఈ టోర్నమెంటులో 15 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, కరాటేలో గోల్డ్‌మెడల్, ఫైట్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన ఇద్దరినీ షోటోఖాన్ అకాడమి చైర్మన్ సుమన్ తల్వార్ బుధవారం బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులను కోచ్ సాయి, బంధువులు అభినందించారు.

## ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి వాటర్ ప్లాంట్



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేటఅర్బన్, మే 22: ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని సుధాకర్ పీవీసీ పరిశ్రమల నిర్వాహకుడు, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. సుధాకర్ పీవీసీ ప్రొడక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్, హైటెక్ బస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ప్లాంట్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శర్మ, డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అర్వపల్లి, మే 22: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అర్వపల్లి మండలంలోని లోయపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం మాచ్యా నాయక్ తండాకు చెందిన లకావత్ సోమ్లా(38)విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. అర్వపల్లి మండలం లోయపల్లి గ్రామ శివారులో విద్యుత్ స్తంభాన్ని తొలగించి, వేరే స్తంభం వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమ్లాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## విద్యుదాఘాతంతో ఆరు గేదెలు..

మఠంపల్లి, మే 22: మండలంలోని అవిరెనికుంటతండా శివారులో విద్యుదాఘాతంలో ఆరు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వీచిన ఈదురు గాలులకు రైల్వే లైన్ సమీపంలో ఉన్న 33కేవీ లైన్ తీగలు తెగి కిందపడ్డాయి. బుధవారం అవడిరెనికుంట తండా శివారుకు మేతకు వెళ్లిన ఆరు గేదెలు, తెగిపడిన విద్యుత్ తీగలను తాకి అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ గేదెల ఖరీదు రూ.3.5లక్షలు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు. ఈదురు గాలులకు తెగిన పడిన విద్యుత్ తీగలను ఆ శాఖ అధికారులు పట్టించుకోకుండా వదిలివేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక రైతులు తెలిపారు.

## ఆటోడ్రైవర్ల ఘర్షణ: 16మందిపై కేసు

కోదాడ రూరల్, మే 22: మండలంలోని యర్రవరం గ్రామంలోని బాల ఉగ్రనరసింహస్వామి దేవాలయం వద్ద మంగళవారం రాత్రి హుజూర్‌నగర్, యర్రవరం ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో 16మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి హుజూర్‌నగర్ నుంచి రెండో ఆటోల్లో భక్తులను యర్రవరం దేవాలయానికి డ్రైవర్లు తీసుకువచ్చారు. దర్శనం అనంతరం భక్తులను తిరిగి తీసుకువెళుతున్న సమయంలో బయటి ఆటోలకు అనుమతి లేదని, తామే తీసుకువెళతామని యర్రవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు, హుజూర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్లతో ఘర్షణకు దిగారు. దీంతో పరస్పరం ఫిర్యాదు చేయడంతో 16మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మృతి

నూతనకల్, మే 22: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పేరం నర్సమ్మ (90) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మండల కేంద్రంలోని స్వగృహంలో మృతి చెందారు. ఆమె మృతదేహానికి సీపీఐ నేత మూరగుండ్ల లక్ష్మయ్య, తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, రాంమూర్తి, ఎల్లయ్య, అబ్బయ్య నివాళులర్పించారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం, పెన్‌పహాడ్, మే 22: నాగారం, పెన్‌పహాడ్ మండలాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. నాగారం ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామ శివారులో ఉన్న బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. పెన్‌పహాడ్ ఎస్ఐ పెరక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోసపహాడ్ గ్రామ శివారులో మూసీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అన్నారంబ్రిడ్జి సమీపంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అలగడప, దాచారం గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా జ్వాల నరసింహస్వామి కల్యాణం



నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారి, హాజరైన భక్తులు

చిలుకూరు, మే 22: మండల కేంద్రంలోని జ్వాల నరసింహస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా నరసింహస్వామి జయంతి వేడుకలు

మునగాల రూరల్, మే 22: మండలంలోని రేపాల గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం నరసింహస్వామి జయంతి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఆలయ చైర్మన్ సారిక చిన్నరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## నృసింహుని క్షేత్రంలో ఇరుముడుల మహోత్సవం

మఠంపల్లి, మే 22: మండలంలోని మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో బుధవారం ఇరుముడుల మహోత్సవం నిర్వహించారు. మండలంలోని మఠంపల్లి, భీల్యానాయక్‌తండా, చౌటపల్లి, పెదవీడు, రఘునాథపాలెం, యాతవాకిళ్ల, దొనబండ తండా, లాలితండా, తుమ్మలతండా తదితర గ్రామాలకు చెందిన నరసింహస్వామి మాలధారులు 40రోజుల పాటు దీక్ష పాటించి, బుధవారం ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పూజలు నిర్వహించి గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టించుకొని కాలినడకన మట్టపల్లికి వచ్చారు. మాలధారులు బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్రించి గురువారం తెల్లవారుజామున స్వామి సన్నిధిలో దీక్షలను విరమించనున్నారు.

## తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం, మే 22: తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరిండెంటెంట్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన రైతు పల్లా రవీందర్‌రెడ్డి టాటా ఏఐజీ పథకానికి రూ.396లు చెల్లించారు. ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో రవీందర్‌రెడ్డి మృతి చెందగా, ఆయన కుటుంబానికి బీమా ద్వారా మంజూరైన రూ.10లక్షల చెక్కును భార్య సునీతకు వెంకటేశ్వర్లు బుధవారం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ రాజకేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రయ్య, హుజూర్‌నగర్ మేనేజర్ ఖాజామియా, ఈదయ్య, వెంకన్న, జరీన, రమేష్, రామనర్సయ్య, కావ్య, నజీర్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నకు మద్దతు పలకాలి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్, సూర్యాపేట టౌన్, మద్దిరాల, తిరుమలగిరి, నడిగూడెం, మే 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)ను గెలిపించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు జగదీష్ రావు కోరారు. బుధవారం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నా సోమయ్య, దేవదానం, లక్ష్మయ్య, అప్పయ్య పాల్గొన్నారు.

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే టీజేఎస్ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డు శంకర్‌గౌడ్, వీరేష్‌నాయక్, బచ్చలకూరి గోపి, బొమ్మగాని వినయ్‌గౌడ్, మల్సూర్‌నాయక్, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి కోరారు.మద్దిరాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పోలుజు సైదులు, కల్లెపల్లి భాస్కర్, పాతూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ కోరారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జుమ్మీలాల్, పేరాల వీరేష్, రాపాక సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

● తీన్మార్ మల్లన్నను గెలిపించాలని మాజీ సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి కోరారు. నడిగూడెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల, మే 22: బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం తుంగతుర్తిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, నూతనకల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు సాధ్యంగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి, తాడికొండ సీతయ్య, మట్టపల్లి శ్రీశైలంయాదవ్, గుండెగోని రాములు గౌడ్, తునికి సాయిలు, దొంగరి శ్రీనివాస్, మున్నా మల్లయ్య, వైస్ ఎంపీపీ జక్కి పరమేష్, బత్తుల సాయిలు, సురేందర్‌నాయక్, విద్యాసాగర్, తిరుమల్‌రావు, బాబు, సైదులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏ రజాక్ కోరారు. మద్దిరాల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కుందూరు విష్ణు వర్ధన్‌రెడ్డి, వడ్డాణం మధుసూదన్, వెంకన్న, మల్లేష్ పాల్గొన్నారు.

# హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలం



సూర్యాపేటలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

సూర్యాపేట సిటీ, తిరుమలగిరి, మే 22: ఎన్నికల హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలో, తిరుమలగిరిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న ధాన్యానికి రూ. 500లు బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కడియం రామచంద్రయ్య, కాప రవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, కర్నాటి కిషన్, ఎండీ అబీద్, చల్లమల్ల నరసింహ, రంగినేని లక్ష్మణ్‌రావు, గోగుల రమేష్ పాల్గొన్నారు.


# మునిసిపాలిటీల్లో 'ఉపాధి' పథకం అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

హుజూర్‌నగర్, మే 22: రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో 'ఉపాధి' పథకాన్ని ప్రభుత్వాలు అమలుచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాల్లో 'ఉపాధి' దొరకక కూలీలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 'ఉపాధి' కూలీలు పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొట్టు లక్ష్మీనారాయణబాబు, జక్కుల రమేష్, మామిడి నర్సయ్య, వెంకన్న, రామయ్య పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోతె, మే 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1996-97పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభాకర్ ఆశయాలు సాధించాలి

అర్వపల్లి, సూర్యాపేట టౌన్, మే 22: మలి తెలంగాణ ఉద్యమ నాయకుడు మందారి ప్రభాకర్ ఆశయాలు సాధించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రెవల్యూషన్ ఆఫ్ మారోజు ఆర్గనైజింగ్ సెక్రటరీ చామకూరి నర్సయ్య అన్నారు. ప్రభాకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రభాకర్ చిత్రపటానికి నర్సయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో ప్రభాకర్ చిత్రపటానికి డేవిడ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బొడ్డు శంకర్, చెరుకు లక్ష్మణ్, స్నేహ, రమ్య, రమేష్, వీరేశం, పర్వతాలు, శ్రీనివాస్, మాంద్ర మల్లయ్యయాదవ్, బత్తుల వెంకన్న, విజయ, కుంట్ల ధర్మార్జున్, జీడి ఉపేందర్, చామకూరి నర్సయ్య, వెంకట్, తిరుపతి పాల్గొన్నారు.

## 'ఇండియా కూటమితోనే దేశం అభివృద్ధి'


సూర్యాపేట టౌన్, మే 22: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇండియా కూటమిని గెలిపించాలని కోరుతూ జిల్లాలోని 'ఆప్' నాయకులు బుధవారం ఢిల్లీలో తెలుగు ప్రజల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రశ్నించే నాయకులను బీజేపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు.. కార్యక్రమంలో శ్యాంకుమార్ పాల్గొన్నారు.

## ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఆరోపణలు అవాస్తవం



కోదాడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

కోదాడ, మే 22: నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. బుధవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైన్యంలో ఉన్నత హోదాలో పనిచేసి, నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని ఉత్తమ్ రాజకీయాల్లోకి వచ్చారని, ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారిగా ఎంపీగా గెలుపొందడంతో పాటు రెండో పర్యాయం మంత్రిగా ఉత్తమ్ కొనసాగుతూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ఉత్తమ్‌కు మహేశ్వర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, కందుల కోటేశ్వర రావు, గంధం యాదగిరి, శివయ్య, దావల్ పాల్గొన్నారు.




సూర్యాపేట సిటీ: బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మన్నెం సదాశివారెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం పట్టభద్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటెల రాజేందర్ హాజరు కానున్నారని ఆయన అన్నారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేరేడుచర్ల: మహిళా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) నియోజకవర్గ అధ్యక్షురాలు సీహెచ్ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పావని అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేటలో జూన్ 2, 3తేదీల్లో నిర్వహించే రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం నేరేడుచర్లలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సయ్యద్ రేష్మ, నాగమణి, నర్సమ్మ, ఫాతిమా, ఫర్వీన్, జ్యోతి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ: సమాజ సేవ ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీవో) లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యమూర్తి అరుణ్ అన్నారు. కార్గిల్ యుద్ధంలో అమరుడైన గోపయ్యచారి విగ్రహానికి కోదాడలో పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఐవీవో ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సామాజిక సేవ, దేశభక్తి పెంపొందించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐవీవో రాష్ట్ర కోఆర్డినేటర్ గుండా మధుసూదన్‌చౌదరి, పి.సత్యబాబు, జగిని ప్రసాద్, గుండపునేని నాగేశ్వరరావు, ఎస్ఎస్.రావు, రమేష్, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

● విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, నీటి పారుదల శాఖ ఈఈ సత్యనారాయణ అన్నారు. ఆస్క్ ఆధ్వర్యంలో కోదాడలో విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్న పాలిటెక్నిక్ కోచింగ్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్నేహ దుర్గయ్య, మాతంగి ప్రభాకర్‌రావు, శౌరి, హుస్సేన్, వెంకటేశ్వర్లు, సైదులు, వెంకటరత్నం, కిరణ్, బుచ్చారావు, షరీఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో గిరిబాబు సూచించారు. మండల కేంద్రంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్, నవభారత్, సాయి గ్రామర్ పాఠశాలల్లో రికార్డులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షర్ఫుద్దీన్ తదితరులు ఉన్నారు.

అర్వపల్లి: పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ అర్జున్ అన్నారు. నట్టల నివారణ కోసం మండలంలో పశువులకు ఉచిత టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌వో రమణ, రైతులు పాల్గొన్నారు

● అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణ క్షేత్రంలో జూన్ ఒకటో తేదీన నిర్వహించే వీరహనుమాన్ జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ఆహ్వానపత్రాన్ని సూర్యనారాయణ క్షేత్రం వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్ అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, నరేష్, యాదగిరి, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, హరినాథ్, గుండా ప్రభాకర్, శేఖర్ పాల్గొన్నారు.

మద్దిరాల: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా వల్లపు రమేష్‌ను నియమించారు. ఈ మేరకు రమేష్‌కు నియామకపత్రాన్ని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కసనబోయిన లింగయ్య, భూతం లింగయ్య, మేడుదల సాయి పాల్గొన్నారు.

● గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలోని మురుగు కాల్వలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు అలసత్వంవహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో 'ఉపాధి' పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో వెంకన్న, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.